# తలపులు పండునా

వసంత పంపించిన ఫెస్టివల్ అడ్వాన్సు అప్లికేషను తిరిగొచ్చింది. వసంత మొహం కోపంతో ఎఱ్ఱబడింది. అసహ్యంతో మనసు కుతకుత లాడింది. కన్నీటి పొరలు చూపుకు అడ్డం నిలిచాయి. కర్చీఫ్‌తో ఎవ్వరికీ కనబడకుండా కళ్ళు తుడుచుకుని, ఎదురుగ్గా ఉన్న ఫైలు తీసి చదవడం మొదలెట్టింది. చుట్టూ ఉన్నవారి వీక్షణాలను తప్పించుకుంటూ.

"ఏదో వాడిఅబ్బసొమ్ము దానంచేస్తూన్నట్టు చేస్తున్నాడే" అన్నాడు మహా జాలిపడిపోతూ హెడ్‌గుమాస్తా శేఖరం. "అసలు ఇవ్వకపోవడానికి కారణమేమిటంటావ్?" అన్నాడు శేఖరంతో రంగనాథన్, టైపిస్టు సిగరెట్టు వెలిగించుకుంటూ.

"అహం... అనలు మొదటినుంచీ కూడా ఈ కొత్త డైరెక్టరుగారు వసంత విషయంలో రూడ్‌గానే వుంటున్నారు. ఎంచేతోగానీ..." గొప్ప సత్యాన్ని వెల్లడిస్తూన్నట్టు పళ్ళికిలిస్తూ చెప్పారు సెక్షను ఆఫీసరు గుప్త.

అంతలో మరో నలుగురయిదుగురు పోగయ్యారు అక్కడికి 'ఏమైంది' అంటూ.

వసంతకి చిరాకెత్తింది మెల్లగా సీటులోంచి లేచి, కూజాలోని మంచి నీళ్ళు గ్లాసులో పోసుకుని. గడగడా తాగొచ్చి మళ్ళీ సీట్లో కూర్చుంది. ప్యూన్ని అడిగితే నీళ్ళు తెచ్చిచ్చేవాడే కానీ వాళ్ళ రిమార్కులు వినకుండా వుండాలనే, పడిగజాలు నడిచి తనే తెచ్చుకుంది. నిజానికి తనకసలు దాహంగా లేదుకూడా. తను నీళ్ళకోసం వెళ్ళిన పదినిమిషాల్లోనూ ఎంత ఒద్దనుకున్నా వాళ్ళ మాటలు చెవుల్లో పడుతూనే వున్నాయ్.

“కూటికి లేకపోయినా పొగరుకేం తక్కువలేదు” ఒక కంఠం. “మహా పతివ్రతలా మాట్లాడుతుంది. అసలు సంగతేమిటో అంతుచిక్కడం లేదు.”

శూలాల్లాంటి ఈ మాటలు సూటిగా హృదయంలో గుచ్చుకున్నాయ్. కళ్ళు నీళ్ళకుండల్లా నిండిపోతున్నాయ్. ఈ మాటలనే ప్రతి వ్యక్తికూడా వయస్సు మళ్ళినవాడే. సెక్షనాఫీసరుకి మరో రెండేళ్ళేవుంది సర్వీసు. టైపిస్టుకి ఆరుగురు పిల్లలు, పెద్దమ్మాయి పెళ్ళికుంది. అయినా వీరి మనస్సుకి ఎదుగూ బొదుగూ లేదు. ఆఫీసులో పనిచేసే ఆడదంటే చులకన. అందులోనూ అవివాహిత అయితే మరీను. వసంత మరి ఆలోచించలేక ఫైలులో తలదూర్చుకుంది ఆలోచనలు గతంలోకి మళ్ళాయి.

o o o

ఆరోజు ఎస్. ఎస్. ఎల్. సి పరీక్ష ఫలితాలొచ్చాయి. వసంత పేరు ఫస్టుక్లాసులోవుంది. ఎగిరి గంతేసింది సంతోషంతో. ఏమైనాసరే ఎం. బి. బి. యస్. చదవాలనుకుంది. అమాటేఅంటే, “నీకేమైనా మతి

పోయిందో? గొంతెమ్మ కోరికలుండకూడదు. మనతాహతేమిటి. మన పేమిటి?" అంది తల్లి కమలమ్మ.

"చూద్దాంలేమ్మా" అన్నాడు తండ్రి రఘురామయ్య.

"చూద్దాంలే ఏమిటండీ. ఎంత చదివినా, కట్నాలు లేకుండా పెళ్ళవుతుందా ఏమిటి? అంతకాడికి ఎందుకొచ్చిన చదువులు? ఇంకా మొగ పిల్లాడు అప్పో సప్పో చేసి వాడికి చెప్పించినా అందం చందం" అంది. ఆమాటలకి వాసు కళ్ళు గర్వంతో మెరిశాయి. బహుశా మొగ పిల్లాడయినందుకు ఆ క్షణంలో గర్వపడుతున్నాడేమో!

"సరేలేవే! ఇప్పట్నించీ ఎందుకా గొడవ" అన్నారు. ఇంకేమనాలో తెలీని రాఘవయ్యగారు.

"చదువుకి ఆడామగా తేడాలేదు. విజ్ఞానం తరగని ఆస్తి. విద్య అందుకు సాధనం" అని బళ్ళో పాఠాలు చెప్పిన తండ్రి ఎందుకు తన విషయం ఇలా నాన్చేశారో వెంటనే బోధపడకపోయినా తరువాత అర్థం అయింది వసంతకి.

ఏడోక్లాసుతో చదువుకి స్వస్తి చెప్పిన శాంతకీ, శ్రీధర్. బి. ఏ. రైల్వే క్లార్కుతో పెళ్ళి జరిపి అత్తవారింటికి పంపడానికి రాఘవయ్యగారు ఉంటున్న చిన్న ఇల్లూ, కమలమ్మగారికున్న కాసిన్ని నగలూ అమ్ముడు పోయినా, ఇంకా నాలుగువేలు అప్పు మిగిలింది.

రాను రాను ఖర్చులు మరీ పెరిగాయి. జానెడు గదులు రెండే అయినా అద్దెమాత్రం రెండొందలు. అదివరకు ఈ అద్దె బాధొకటీ వుండేది కాదు. అందులోనే పండుగలు, పబ్బాలు, కొత్త అల్లుడి రాకపోకలూనూ. ఎం. బి. బి. యస్. అనుకున్న వసంతకి కనీసం డిగ్రీకోర్సులో చేరే అవకాశం కూడా లేకుండా పోయింది. మరో సంవత్సరానికే రాఘవయ్య రిటైరయ్యాడు. దాంతో ఇంటి పరిస్థితి మరీ కుంటుపడింది. పూట గడపటం కష్టమైపోయింది. దానికితోడు శాంత పురిటికిరావడం. ఈ ఆడంబరాలనుంచి శాశ్వతంగా తప్పించుకున్నారు రాఘవయ్యగారు గుండె పోటుకి కృతజ్ఞతలు చెబుతూ.

అటువంటి పరిస్థితుల్లో ఉద్యోగంలో చేరింది వసంత. నెలకి రెండొందలు జీతం. ఎలాగో కష్టపడి, తమ్ముళ్ళని, చెల్లెళ్ళనీ చదివిస్తోంది. ఎంత జాగ్రత్తగా ఖర్చుపెట్టినా, జీతం సరిపోవడంలేదు. 'అదివరకు ఆదినారాయణగారు డైరక్టరుగా వున్నప్పుడు తనని కన్నబిడ్డలా చూసుకునేవారు. తను టెంపరరీ కాండిడేటు అయినా ఎవరంటుగా పర్మనెంటు వాళ్ళచేత గ్యారంటీ సంతకం చేయించి ప్రావిడెంటుఫండు లోను, కొంత లోను, ఎంప్లాయీల జీవిత భీమాలోంచి కొంతలోను అవసరం వచ్చినప్పుడల్లా ఇప్పించేవారు. ఫెస్టివల్ అడ్వాన్సుకూడా ఇంతే. ఆయనకి ట్రాన్స్‌ఫర్ అవడం తన దురదృష్టమే' అని వాపోయింది వసంత.

గడియారం టంగ్ టంగ్ మంటూ నాలుగు కొట్టింది. "అబ్బా — ఇంకా గంట టైముంది ఇంటికి పోవడానికి" అనుకుంటూ, ఫైలుముందరేసుకుంది. కానీ మనస్సంతా వికలంగా వుంది. పని చెయ్యబుద్ధి పుట్టడంలేదు. మళ్ళీ మనస్సు గతంలోకి జారిపోయింది.

ఆరోజు— కొత్త డైరెక్టరుగారు ప్రతి సెక్షనుకి వచ్చి, అందర్నీ కలుసు కుంటారట" అన్నాడు సెక్షనాఫీసరు గుప్తా.

అందరూ ఎవరిసీట్లలో వాళ్ళున్నారు. కొత్త డైరెక్టరుగారు ఎలా వుంటారో కూడా తెలీనివాళ్ళు మరీ ఉబలాట పడుతున్నారు చూడాలని. కొద్దిగా అతని గురించి తెలిసినవాళ్ళు, ఒకటి రెండుసార్లు కలిసినవాళ్ళు, అతని గురించి చెబుతూ వుంటే, కొందరు లోలోపలే బాధపడిపోతున్నారు: ఆ చెప్పేవాళ్ళేదో ముందే తమకన్న ఎక్కువ పలుకుబడి సంపాయించు కుంటారేమోనని.

అంతలో కొత్త డైరెక్టరుగారు రావడం ఒక్కొక్క నిముషం చొప్పున ఒక్కొక్క సెక్షనువాళ్ళని కలుసుకోవడం అన్నీ జరిగిపోయాయి.

అతన్ని చూడగానే, తండ్రిని చూసినట్టే అనిపించింది తనకి సగం నెరిసినజుట్టు పొడగు లావు అంతా "నాన్న సూటు వేసుకుంటే అచ్చం ఇలాగే ఉండేవారేమో" అనుకొని నవ్వుకుంది.

ఎవరితో పనన్నా ప్రతి చిన్న పనికీ తనరూమ్‌లోకి పిల్చే వారతను. "పనిచిన్నదే అయినా, పరిచయం కలగాలనే అభిలాషతో పిలుస్తున్నాను" అని అతనన్న మాటలకి, గుమాస్తా దగ్గర్నుంచి ఆఫీసర్లదాకా పొంగి పోయారు. డైరెక్టరుగారు వారితో మాట్లాడే పద్ధతి చూసి నిగర్వి అని నిరాడంబరి అని బిరుదులు పారేశారు.

ఒకరోజు తనని కేకేశారు. టేబులు కెదురుగా నుంచున్న తనని "ప్లీజ్ సిట్ డవున్" అన్నారు. "ఇట్స్ ఆల్ రైట్ సార్" అంది. "నో..నో..

కూర్చో" అంటూ కుర్చీ చూపించారు. మరీ మొండి చేస్తే బాగుండదని కూర్చుంది ఫైలు చదువుతూ చదువుతూ ఏవో 'క్వొశ్చన్సు' వేశారు. సమాధానాలు చెప్పింది. మాటల్లో అతని బూట్లు, తన కాళ్ళకి తగిలాయి రెండు మూడుసార్లు కాళ్ళు పక్కకి జరుపుకుని ముడుచుకుపోయి కూర్చుందితను.

"మీ సర్వీసు మూడేళ్ళకమా?"

"అవునండి" అంది.

"మరి ఇంకా టెంపరరీగానే వుండిపోయారేం?"

"పర్మనెంటు వెకన్సీ రాలేదుట, వస్తే చేస్తామంటున్నారు."

"ఒక అప్లికేషన్ పెట్టండి"

"అలాగే" అంటూ లేవబోయిన తనకి కాగితం కలం అందివ్వడం చూసి, "నేను రాసితీసుకొస్తాలెండి" అంది.

"ఇక్కడే రాసేయ్ ఫరవాలేదు" అన్నాడాయన. ఆ ఏకవచన సంబోధనకి ఆశ్చర్యపడ్డా వెంటనే తమాయించుకుని కాయితం అందుకోబోయేటప్పటికి, చేతులు పట్టుకుంటున్నట్టుగానే, కలం కాగితం చేతిలో పెట్టాడు. షాక్ కొట్టినట్టు చెయ్యి వెనక్కి లాగేసింది తను. కాగితం టేబిల్ మీద పడింది. అతను వెకిలిగా నవ్వాడు. గబగబా ఇవతలికొచ్చేసింది తను. అప్లికేషన్ రాసి ప్యూనుకిచ్చి పంపించింది. ఆ తరవాత వారం రోజులకి తెలిసిందేమిటంటే, తన జూనియర్ డేవిడ్‌కి కన్ఫర్మేషన్

ఒచ్చినట్టు. అవమానంతో కుంగిపోయింది తను. కారణాలు ఎవరికీ తెలీక పోయినా, తన మనస్సుకి తెలుసు. మాటాడక ఊరుకుంది.

\+ \+ \+

ఆ తరవాత మరోసారి. శాంత పిల్లలూ ఒచ్చేరు ఊరునుంచి దీపావళి ముందర ఒచ్చారని పండగయ్యేదాకా వుండి వెళ్ళమంది అమ్మ.

"మనం ఎలావున్నా ఫరవాలేదు, అక్కకి పిల్లలకి బట్టలు పెట్టక పోతే బావుండదమ్మా" అంది.

"అక్కేం పరాయిదా అమ్మా. మన బాధలు, దానికి మాత్రం తెలీవూ" అంది తను.

"అక్క పరాయిది కాకపోవచ్చు. కానీ. బావ ఏమనుకుంటాడు? ఆ మాత్రం చెయ్యకపోతే, దానికి వాళ్ళింట్లో ఏం విలువ వుంటుందివెప్పు?"

'విలువలు పెట్టుపోతల వల్లేనా' అందామనుకుంది. 'కానీ ఒక్క అమ్మనంటే ఏం లాభం? అందరూ ఇంతే· ముఖ్యంగా మన దేశంలోమధ్య తరగతి వాళ్ళు బాగుపడక పోవడానికి ఇవే కారణాలు కడుపు మాడ్చుకునయినా 'ఫార్మాలిటీస్'కి ప్రాముఖ్యాన్నిస్తారు. ఛీ...ఛీ—' అనుకుంది. మారే కాలంలోకూడా మారని మనుషులని గురించి ఆలోచిస్తూ·

ఆ రోజున అలవాటు ప్రకారం గ్యారంటియర్ సంతకం తీసుకుని పండుగ అడ్వాన్సుకోసం అప్లికేషను పెట్టుకుంది.

కాస్సేపటికి "అయ్యగారు పిలుస్తున్నారు" అంటూ ప్యూన్ వచ్చాడు.

"టెంపరరీవాళ్ళకి లోను ఇవ్వకూడదను రూల్సు ప్రకారం" అన్నారు డైరెక్టరు.

"గ్రాంటుచేయమని వున్నారు కదండి అతను పర్మనెంటే—ఇంతకు ముందు—"

"అలా వీల్లేదు. రూల్స్ ఆర్ రూల్స్."

ఎలా చెప్పాలో తెలీలేదు తనకి.

అంతలోనే కళ్ళజోడు సవరించుకుంటూ

"అంత అవసరమా డబ్బు" అన్నాడు.

"అవునండి" అంది ముక్తసరిగా తను.

జేబులోంచి రెండు వందరూపాయల కాగితాలు తీసి అందివ్వబోయాడు.

ఆశ్చర్యంగా చూసింది అతనికేసి.

వెకిలిగా నవ్వాడతను.

ఆ నవ్వు ములుకుల్లా గుచ్చుకుంది గుండెల్లో.

'వద్దు' అంది.

"నీకు లోనరాదు" కటువుగా అన్నాడు.

"ఫరవాలేదు" తిరిగొచ్చేసింది. ఏం చెయ్యాలో తెలీక పిచ్చిదానిలా తలపట్టుకు కూర్చుంది.

\+ \+ \+

తను మెల్లగా నడుచుకుంటూ ఇల్లు చేరుకునే సరికి తన కొలీగ్ రామారావు సైకిల్ మీద అప్పుడే ఇల్లు చేరుకున్నాడు.

'ఇలా వచ్చారేమిటండి' అంది ఆశ్చర్యంగా.

'వసంతగారూ! నా ఫెస్టివల్ అడ్వాన్సు మీరు తీసుకోండి. నాకవసరంలేదు, ఊరికే ఇస్తున్నారుకదా అని పెట్టానంతే.' అన్నాడు.

అతని మంచితనానికి ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలీలేదు. "థాంక్స్" అంది, డబ్బు అందుకుంటూ "కాఫీ తాగి వెళ్ళండి" అని లోపలికి పిలిచింది. కాఫీ తాగుతూ అతను చెప్పిన విషయాలన్నివిని ఆశ్చర్యపోయింది.

బంట్రోతు దగ్గరనుంచీ ఆఫీసరు దాకా అందరూ ఆయనకి లంచాలిస్తారట. సెలవు సాంక్షనుకి, ప్రమోషనుకి, అన్నింటికికూడా తృణమో పణమో అర్పించుకోవాలట. డేవిడ్‌కూడా అలాగే పర్మినెంట్ అయ్యాట్ట. ఏమీ ఇచ్చుకోలేని వాళ్ళు కనీసం బజారుకెళ్ళడం, ఎగైరాలాంటి చాకిరీ చేస్తారట.

ఆ మాటలు వింటూవుంటే తల తిరిగిపోయింది వసంతకి. వయస్సులో చిన్నవాడైనా, రామారావు మంచితనం ఎంతో గొప్పవనిపించింది. అతని ప్రవర్తనా, మాటా, మంచితనం, ప్రతివారికి అతనిమీద గౌరవం పుట్టిస్తుంది. అందుకే సంకోచించకుండా తీసుకుంది.

"తలలు పండినంత మాత్రాన తలపులు పండునా" అన్న వేమన గారి మాటలు గుర్తుకొచ్చాయి నవ్వుకుంటూ లోపలికెళ్ళింది. ఆసత్యాన్ని స్వతహాగా, అనుభవంవల్ల తెలుసుకున్న వసంత.